క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఈఓ కవిత

పెనుకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టింబక్ట్ కలెక్టివ్ సీఈఓ కవిత సూచించారు. పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీలో శనివారం దుర్గా శక్తి సొసైటీ అధ్యక్షురాలు ముంతాజ్ ఆధ్వర్యంలో టింబక్ట్ కలెక్టివ్ ఉచిత న్యాయసేవా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కుటుంబంలో మహిళలు నిర్ణయాధికారం కలిగి ఉండాలన్నారు. . మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పనిచేసే ప్రాంతాల్లో మహిళల ఇబ్బందుల గురించి నాటిక ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో రవళి, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ, నాగమ్మ దుర్గాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రం పరిగిలో వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. ఛత్రపతి శివాజీ వాలీబాల్ టోర్నమెంట్ పేరుతో బంగారు చంద్ర ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సంగారెడ్డి, సంజీవమూర్తి, బాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక



ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులు

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు బిందులహరి, రచన, యామిని ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగార్జున శనివారం తెలిపారు. వారికి నాలుగేళ్ల పాటు రూ.12 వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: తాలూకాలోని వీహెచ్ పాళ్య ఎస్సీ కాలనీలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే హెచ్.వి వెంకటేశ్ శనివారం భూమి పూజ చేశారు. అలాగే రూ.20 లక్షల నిధులతో చరండి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వీర హనుమక్క దేవాలయాన్ని దర్శించి పూజలు చేయించారు. కార్యక్రమంలో ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు మంజునాథ్, ప్రథమ శ్రేణి కాంట్రాక్టర్ ఏ.శంకరరెడ్డి, హనుమంతరాయప్ప, గోపి, దయానంద, వాగీశ్, వీరభద్రప్ప, శివమూర్తి పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



సొరంగ మార్గం ఏర్పాటుకు గుంత తవ్విన దృశ్యం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళికి చెందిన దొడ్డ జాలోడు గ్రామంలో హొయత్సలుల కాలం నాటి పురాతన వేణుగోపాలస్వామి దేవాలయాన్ని గుప్త నిధుల కోసం కొంత మంది ధ్వంసం చేసిన ఉదంతం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి బయలు ప్రదేశంలో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయంలో గుప్త నిధుల కోసం సొరంగ మార్గం ఏర్పాటుకు గుంత తవ్వారు. గతంలో కూడా వేణుగోపాల స్వామి దేవాలయంలో నిధులు, దేవుళ్ల విగ్రహాలు, ఆలయ గోపురాన్ని సైతం నిధి దొంగలు ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవలు, అస్తోత్త, విష్ణుసహసహస్ర నామాలు, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవి మేతంగా నరసింహస్వామిని వెండి కవచాలు, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి మహామంగళ హారతి ఇచ్చారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు.







రొద్దం మండలంలోని గ్రామంలో డ్రైనేజీ శుభ్రం చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు , ప్రభుత్వాస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం , రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

గ్రామ సేవే మహాయజ్ఞం

- సత్యసాయి సేవా సమితి సభ్యుల సేవలు
- అభినందిస్తున్న ప్రజలు

రొద్దం: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సభ్యులు 'గ్రామ సేవే మహాయజ్ఞం' కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. మండలంలోని సత్యసాయి సేవా సమితి సభ్యులు అనేక గ్రామాల్లో రహదారులకు ఇరువైపులా కంపచెట్లు తొలగించడం, పిచ్చిమొక్కలను తొలగించడం, రోడ్లను శుభ్రం చేయడం వాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేసి విద్యార్థులకు అనువుగా మారుస్తారు. అలాగే పేద విద్యార్థులకు, పేద కుటుంబాలను ఆదుకోవడంలో ముందుంటారు. ప్రతి వారం వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం సదుపాయం కల్పిస్తున్నారు. దివ్యత్వం పేరుతో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తారు. సాత్యసాయి భక్తులు శ్రమదానంలో అనేక కార్యక్రమాలు చేపడుతుంటారు. వివిధ సేవలందిస్తూ మండల ప్రజల చేత శభాష్ అనిపించుకుంటున్నారు.

> **మానవసేవే మాధవసేవ**
>
> 
>
> ఏదో ఒక రకంగా పదిమందికి ఉపయోగపడాలన్న సత్యసాయిబాబా పిలుపు మేరకు శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పేదలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. సమితిలో డబ్బులు ఉన్నవారు పేదలకు సాయం చేయడం, ఏమీ లేని వారు ప్రజలకు ఉపయోగపడే పలు సేవా కార్యక్రమాలు చేస్తాం.
>
> – అంజినరెడ్డి, సత్యసాయి మండల కోఆర్డినేటర్

రక్తదానాన్ని అభిలాషగా అలవర్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

హిందూపురం: యువత రక్తదానం చేయడం అభిలాషగా అలవర్చుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డేవిడ్‌రాజ్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ యువసేన సంస్థ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చరణ్ కుమార్, చైతన్య గంగిరెడ్డి, ఉమర్ ఫరూక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, గర్భిణిల ప్రసవ సమయంలో ఆపరేషన్ల సమయంలోనూ రక్తం కోసం ఇబ్బందులు పడకుండా యువత రక్తదానం చేయాలన్నారు. అనంతరం రక్తదాతలకు సన్మానించారు. తర్వాత సామాజిక సేవా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రక్తదాతలతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తిప్పే స్వామి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేట వెంకటరమణ ఆలయంలో విశేష పూజలు



అలంకరణలో మూలవిరాట్ పేట వెంకటేశ్వరస్వామి

హిందూపురం: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో పేట వేంకటరమణ స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి భూదేవి సమేత పేట వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చి మంగళవాయిద్యాలతో ప్రాకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని డిబికాలనీ, టీచర్స్‌కాలనీలోని శనేశ్వరస్వామి ఆలయాల్లో మూలవిరాట్‌కు తిల తైలాభిషేకాలు నిర్వహించి విశేషంగా వెండి కవచ అభరణాలతో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జైష్టదేవి సమేత శనిదేవుడి ఉత్సవ మూర్తులను విశేష పుష్పాలంకరణలు చేసి ప్రాకారోత్సవం నిర్వహించి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం వందలాది భక్తులు తరలివచ్చి ఆలయ ఎదుట తిల తైలాలతో దీపారాధనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా అంజనా దేవి ఆరాధనోత్సవం



కోన కణ్వాశ్రమంలో అంజనాదేవి విగ్రహాన్ని అలంకరించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కోన కణ్వాశ్రమంలో శనివారం అంజనాదేవి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. కోన కణ్వాశ్రమం ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందేందుకు అంజనా దేవి తన దివ్యదృష్టితో ఎంతో కృషి చేశారు. అంజనా దేవి 1977వ సంవత్సరంలో పరమపదించడంతో అప్పటి నుంచి ప్రతి ఏడాది అంజనాదేవి ఆరాధనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. గోపూజ, ధ్వజారోహణం అనంతరం భగవద్గీత పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆరాధనోత్సవం సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం 7 గంటల నుంచి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నీట్‌లో కదిరి విద్యార్థులకు ర్యాంకులు

కదిరి అర్బన్: నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్)లో పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యంనాయుడు కుమారుడు వేమూరి కార్తికేయకు ఆల్ ఇండియా ర్యాంక్ 27,637, ఈడబ్ల్యూఎస్ క్యాటగిరిలో 3,233 ర్యాంకు వచ్చింది. అలాగే మొటుకుపల్లికి చెందిన శేఖర్‌రెడ్డి, రాధమ్మ దంపతుల కుమారుడు ఆర్ హర్శిత్‌రెడ్డి ఆల్ ఇండియా ర్యాంక్ 8,905, ఈడబ్ల్యూఎస్‌లో 907 ర్యాంక్ సాధించాడు. మాస్టర్ ఆఫ్ సర్జన్ చేసి పేదలకు వైద్యం అందించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు హర్శిత్ రెడ్డి తెలిపారు.

పుట్టపర్తి అర్బన్: సుబ్బరాయనిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కం టైలర్ అయిన బాబు అనితల కుమారుడు వడ్డె మనోజ్‌కుమార్ శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఆలిండియాలో 40,633, కేటగిరీలో 19,150 ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు మనోజ్‌కుమార్‌ను అభినందించారు.

విద్యార్థి అదృశ్యం



మహేంద్రనాయక్

కదిరి టౌన్: తల్లిదండ్రులు మందలించారనే కోపంతో ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. వివరాలు.. మడకశిర ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న కృష్ణా నాయక్ కుమారుడు మహేంద్ర నాయక్ నాలుగేళ్లుగా నీట్ పరీక్ష రాస్తున్నాడు. అయితే శనివారం విడుదలైన నీట్ పరీక్షల ఫలితాల్లో తగిన మెరిట్ రాకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన విద్యార్థి సాయత్రం పట్టణంలోని చైర్మన్ స్ట్రీట్‌లోని తన నివాసం నుంచి తన సెల్ ఫోన్ ఇంట్లోనే ఉంచి బయటకు వెళ్లిపోయాడు. ఇంతవరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కృష్ణానాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జేవీవీలో భాగస్వాములు కండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ తదితరులు

కదిరి టౌన్: శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కావాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం జేవీవీ సభ్యత్వ ప్రచారానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ ప్రజల కోసం , ప్రగతి కోసం, దేశ స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదాలతో 38 ఏళ్ల క్రితం జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి తెలుగు ప్రజలతో మమేకమై శాస్త్రీయంగా ఆలోచించాలని మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ తన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, నర్సారెడ్డి ,జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్, తహీర్, బాబ్జాన్, ఉపాధ్యాయులు ఎల్లప్ప, జవహర్, రాజారత్నం, శివారెడ్డి, చంద్ర, సలీమ్, బాషా, నాయకులు రామాంజనేయులు, మహబూబ్ బాషా, చిన్నారావు, ఫారెస్ట్ అధికారి హరి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ నిఖిత, శ్రావంతి

హిందూపురం: స్థానిక ఎంజీఎం ఉన్నతపాఠశాల ఆవరణలో బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి బృందం, ట్రినిటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ కుమార్‌రాజా, కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నిఖిత, శ్రావంతి 570 మందికి పరీక్షలు చేసి 220 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. రోగులను బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ల అనంతరం హిందూపురం తీసుకొస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం గత నెలలో ఆపరేషన్ చేసుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్ శివప్రకాష్, వలంటీర్లు రహంతుల్లా, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

సోమందేపల్లి: మండల కేంద్రంలో శనివారం సక్షమ్ అఖిల భారత సేవా సంస్థతో పాటు ఛత్రపతి శివాజీ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. కడపలోని పుష్పగిరి ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది 200 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 50 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదాల పిలుపు



మానేపల్లి చెరువు వద్ద మలుపు

లేపాక్షి: హిందూపురం నుంచి కంచిసముద్రం వెళ్లే రహదారిపై మానేపల్లి వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా చెరువు మరువ వద్దనే మలుపులు ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు భయంతో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట హర చతుర్థి

హిందూపురం: సంకష్టహర చతుర్థి పురస్కరించుకుని శనివారం గణపతి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. శ్రీనివాసనగర్, బెంగళూరు రోడ్డులోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం మూలవిరాట్ మహాగణాధిపతికి పంచమృతాభిషేకాలు చేసి వెండి అభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో గణపతి హోమాలు చేపట్టారు. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు రాత్రి ఆలయానికి చేరుకుని గణపతికి పూజలు చేసి ఉపవాసదీక్షను విరమించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జూదరుల అరెస్టు

హిందూపురం: పట్టణ సమీపంలోని పరిగి రోడ్డులో శనివారం రాత్రి జూదం ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.14 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిక్కహళ్లి అధ్యక్షురాలిగా రామాంజినమ్మ



నూతన అధ్యక్షురాలిని సన్మానించిన దృశ్యం

పావగడ: చిక్కహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతురాలు రామాంజినమ్మ ఎన్నికయ్యారు. పంచాయతీ కార్యాలయంలో శనివారం అధ్యక్ష స్థానానికి పోటా పోటీగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో 8 ఓట్లు సాధించిన రామాంజినమ్మను ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఈఓ జానకీరాం అధికారికంగా ప్రకటించారు. ఈ గ్రామ పంచాయతీలో మొత్తం 14 మంది గ్రామ పంచాయతీ సభ్యులుండగా ప్రత్యర్థి పార్వతమ్మకు 6 ఓట్లు పడ్డాయి. విజేత రామాంజినమ్మకు 8 ఓట్లు రావడంతో రెండు ఓట్ల మెజారిటీతో గెలిచింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు రామాంజినమ్మను సన్మానించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు




రొద్దకాంబదేవాలయం వద్ద విద్యుత్ స్తంభం



విద్యుత్ స్తంభం కింది భాగం పూర్తిగా విరిగిన దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలోని రొద్దకాంబదేవి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఓ విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా మరింది. విద్యుత్ స్తంభం కింది భాగం పూర్తిగా విరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు గ్రామస్తులు వాపోయారు. అదేవిధంగా సచివాలయం-3 సమీపాన ఓ రైతు పొలంలో విద్యుత్ స్తంభం కింది వంగిపోయిందని రైతులు తెలిపారు. విద్యుత్ స్తంభం కింది వాలిపోడంతో కరెంట్ తీగలు చేతి కందే ఎత్తులో ఉన్నాయన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు మార్చాలని రైతులు, గ్రామస్తులు కోరారు.



సచివాలయం-3 సమీపాన పొలంలో వాలిపోయిన 11 కేవీ విద్యుత్ స్తంభం

నేడు 'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

మడకశిర: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ రమేష్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో చీకటి రోజులు, రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అరాచకం, హామీల పేరుతో ప్రజలకు వెన్నుపోటు తదితర వైఫల్యాలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జిల్లా, రాష్ట్ర కమిటీల సభ్యులు, మండల కన్వీనర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రొళ్ల: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మడకశిరలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో వెన్నుపోటు పుస్తకావిష్కరణ జరగనుందని మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, జిల్లా స్థాయి నాయకులు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకావిష్కరణకు తరలిరండి

అమరాపురం: మడకశిరలో జరిగే వెన్నుపోటు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ సంఘాల మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు, మాజి డీలర్లు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్టి సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో మడకశిరకు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగా సాధన చేస్తున్న అధికారులు

రొళ్ల: యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయక్తంగా కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. యోగా చేయడాన్ని ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవాలన్నారు. రోజూ ఉదయాన్నే గంటపాటు యోగా చేయాలని సూచించారు.

నేడు శివాలయ గోపుర కలశ స్థాపన

లేపాక్షి: పి.సడ్లపల్లి గ్రామంలో వెలిసిన శివాలయంలో ఆదివారం ఉదయం కలశస్థాపన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. సోమవారం నవగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

తిరుమలదేవరప్ప ఆలయంలో శ్రీనివాస కల్యాణం:

లేపాక్షి పాతూరులో వెలిసిన తిరుమలదేవరప్ప స్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, తిరుమలదేవరప్ప వంశస్థులు శనివారం తెలిపారు. గణపతి హోమం, ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు, అభిషేకార్చనలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని కోరారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ధర్మవరం బాలిక



మైత్రి

ధర్మవరం రూరల్: ధర్మవరంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న పట్టణానికి చెందిన మైత్రి అండర్-19 బాలికల విభాగంలో జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతు ఈ నెల 18 నుంచి 24 వరకు నెల్లూరులో జరిగే క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు తరఫున పాల్గొంటుందన్నారు. ఆర్డీటీ ఇస్తున్న ఉచిత కోచింగ్‌తో తాను జిల్లా జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని మైత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీటీ కోచ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.